ప్రేమమీద
నమ్మకంలేక
ప్రియుడిని
తిరస్కరించిన
ఆమె జీవితం?

# ఒంటరి పక్షి

పెరుమాండ్ల
శ్రీదేవి
కథ

"శరణ్యా" కళ్లలో కోటి ఆశల దీపాలు వెలిగించుకుని ఆర్తిగా పిలిచాడు అనూప్.

పేపర్లోనుండి తలెత్తింది శరణ్య. ఆమె ముఖం భావరహితంగా వుంది.

అనూప్ మనసు చివుక్కుమంది.

ఆ భావరహితమైన చూపే అతన్ని నిలువునా చీలుస్తుంది. అతను ఏ భావంకోసమైతే ఆమె కళ్లలోకి ఆశగా చూస్తాడో అతనికి నిరాశే ఎదురవుతుంది.

ఇప్పుడుకూడా అతను ఆమె కళ్లలోకి చూశాడు. ఏ భావమూ కనిపించలేదు. ఒక్కసారిగా నీరుగారిపోయాడు.

"నీ నిర్ణయం మారదా శరణ్యా" ఆశగా అడిగాడు.

మౌనంగా తలదించుకుంది శరణ్య.

"మాట్లాడవేం..." రెట్టించాడు అనూప్.

"చూడు అనూప్, జీవితంలో ఎన్నో ఎదురుదెబ్బలు తిన్నదాన్ని నేను. నా జీవితంలో ప్రతి క్షణం నేను సంఘర్షిస్తూనే వున్నాను. ఎన్నో బాధల్ని ఎన్నో ఒడిదుడుకుల్ని చవిచూశాను. రెండు పదుల ఈ జీవితంలో ఎన్నో వేదనాభరితమైన సంఘటనల్ని, దుఃఖపూరితమైన బాధల్ని అనుభవించాను"

"కారణం" అడిగాడు.

"నా తల్లి" సమాధానమిచ్చింది.

ప్రశ్నార్థకంగా చూశాడు అనూప్.

"నా తల్లికి ఎదురైన అనుభవాలద్వారా ఎన్నో గుణపాఠాల్ని నేర్చుకున్నాను నేను. నా తల్లి అమాయకురాలు అనూప్. వయసులో వున్నపుడు అందరు కన్నెపిల్లలలాగానే కలలు



కనేది.

అన్నా, వదినలు పెట్టే బాధల్ని భరిస్తూ, ఆ బాధల్ని మరచిపోవడానికి అందమైన కలలు కంటూ ఊహాలోకాల్లో విహరించేది. ఒక్కొక్కసారి ఒంటరిగా కూర్చుని ఏడ్చేది. ప్రేమగా పలకరించే మనిషికోసం తపించిపో యేది. తనకెవరూ లేరనే దిగులు మనసంతా ఆక్రమించుకుంటున్న తరుణంలోనే ఆమె

కు వసంత్ ఎదురయ్యాడు.

అతను మా అమ్మ పరిస్థితిని చూసి ఆమెను అందంగా వంచించాడు. ప్రేమిస్తున్నానని, తను లేకుంటే బ్రతకలేనని, పెళ్లి చేసుకుంటానని చెప్పాడు. మా అమ్మకూడా అందరు ఆడపిల్లల లాంటిదే. అందునా ఒంటరితనంతో అణగారిపోయి వుందో ఏమో, అతని ప్రేమలో వెర్రిదయిపోయింది.

అతన్నిగూర్చి అందమైన కలలు కనేది. తనూ, తన భర్త, పిల్లలు అంటూ అందమైన సంసారం గురించి రంగురంగుల కలలు కంటూ ఊహాలోకాల్లో విహరించేది. ఒకరోజు అతను ఎలా వచ్చాడో అలాగే నిష్క్రమించాడు. అప్పటికే మా అమ్మ గర్భవతి.

విషయం తెలిసి అన్నా, వదినలు అర్ధరాత్రిపూట ఇంటినుండి తరిమేశారు. రోడ్డుమీద నిస్సహాయంగా వున్న మా అమ్మను ఒక చర్చ్ ఫాదర్ ఆశ్రయమిచ్చి ఆదుకున్నాడు. ఆ తరువాత నేను పుట్టాను.

అంతవరకు మాటలతో మా అమ్మను హింసించిన ఈ సమాజం నన్ను హింసించడం మొదలుపెట్టింది. మొదట ఈ ఇల్లాంటి మాటలకి విలవిల్లాడిపోయి ఏడ్చేసేదాన్ని.

కాని, ఆ తరువాత మనుషుల నైజాన్ని అర్ధం చేసుకోసాగాను. మనం బాధపడుతున్నామని తెలిస్తే ఈ మనుషులు ఇంకా బాధపెడలారు. దానివల్ల వారికే అదోలాంటి తృప్తి. అదొక శాడిజం. అదే మనం స్పందించుకోకుండా నిర్లక్ష్యంగా వుంటే వారికి సంతృప్తి అనిపించి వదిలేస్తారు. అందుకే స్పందించుకోవడం మానేశాను.

నేను సంఘంతో ఎంత సంఘర్షిస్తున్నప్పటికీ, నా తండ్రి ఎవరూ అన్న ఆలోచన నాకు కలుగకపోలేదు. ఆ విషయం తెలుసుకోవడానికే రహస్యంగా మా అమ్మ డైరీ చదివాను. ప్రతిపేజీలోనూ తన బాధనంతా వ్రాసుకుంది మాఅమ్మ. నేను చదివింది ఆమె డైరీని కాదు ఆమె జీవితాన్ని.

అపుడే నా జన్మకు కారకుడైన నా తండ్రికాని తండ్రిమీదేకాదు, ప్రేమ అనే పదం మీదే అసహ్యంకలిగింది. ప్రేమ అనేది మనిషిని, మనసును వెన్నుపోటు పొడవడానికి మరోమనిషి వాడుకునే ఆయుధం'' ఆయాసంతో ఆగిపోయింది శరణ్య.

''నీ జీవితంలో ఎదురయిన ఒక సంఘటన ద్వారా ప్రేమమీద నమ్మకం లేదనడం ఎంతమాత్రం సమంజసం. ప్రేమనేదే లేకుంటే ఈ ప్రపంచం ఏనాడో అంతరించేది శరణ్యా. ఒకరు మోసం చేసినంతమాత్రాన అందరూ అలాగేవుంటారని ఎందుకనుకుంటున్నావు. ఎంతమంది ప్రేమవివాహాలు చేసుకోవడంలేదు. వారు సుఖంగా, ఆనందంగా వుండడంలేదా. వీరిని గురించి ఎందుకు ఆలోచించవు నీవు'' అన్నాడు అనూప్.

''ఎలా ఆలోచించాలి అనూప్. దెబ్బతిన్న నా తల్లి నా ఎదురుగా కనిపిస్తుంటే, గాయపడిన హృదయంలో నా తల్లి రాత్రిళ్లు మౌనంగా రోదిస్తుంటే ఈ మనుషులమీద నాకు ఎంత అసహ్యంకలిగేదో నీకెలాచెప్పను.

ప్రేమనేది మనసును, శరీరాన్ని అందంగా మోసం చేయడానికి వాడుకునే వస్తువు. మనుషుల మధ్య ఈ అనుబంధాలు, అనురాగాలు, ప్రేమలు అంతా ట్రాష్. ప్రేమనేది

ఒక నాటకం, ఒక భ్రమ, ఒక స్వార్థం, ఒక ఎండమావి.

బాణందెబ్బతిన్న పక్షిలా విలవిల్లాడాడు అనూప్.

ఆమె "నువ్వంటే నాకు ఇష్టంలేదు" అని అన్నాకూడా అతను అంత బాధపడేవాడు కాదేమో. కాని ఆమె ప్రేమను నిర్వచించిన విధానం అతన్ని బాధపెట్టింది.

ప్రేమ! వసంతకాలపు ప్రత్యూషంలో లేత చిగురు మాటునుండి కూసే కోయిలగానం ప్రేమ.

శరత్కాలం మధ్యరాత్రిలో ఆకాశంనుండి కురిసే వెన్నెలవర్షం ప్రేమ.

ఓ అమృతంకురిసే రాత్రి హృదయాకాశంలో సంచరించే శరన్మేఘ శకలం ప్రేమ.

అతనికి ప్రేమ వివాహం చేసుకుని ఇప్పటికీ ఒకరికోసం ఒకరుగా అన్యోన్యంగా వుంటున్న తన తల్లిదండ్రులు కళ్లముందు కదిలారు.


"ప్రేమనేది ఒక నాటకమయితే అనార్కలి — సలీం, లైలా — మజ్నూ, పార్వతి — దేవదాసులు చరిత్రలో అమరప్రేమికులుగా ఎందుకు నిలిచిపోతారు. వారిమధ్య వున్న ప్రేమకూడా నాటకమేనని ఎలాఅనగలవు"

వారంతా విఫలప్రేమికులు అనూప్. విఫలమైన ప్రేమకే చరిత్రలో స్థానం వుంటుంది. ఒకవేళ వారి ప్రేమే ఫలించి వుంటే వారు కూడా అందరు భార్యాభర్తల్లాగానే పోట్లాడుకుంటూ వీధినపడేవారు. దూరంగా వున్నంతకాలమే దాని విలువ. దగ్గరికొస్తే ఏమీ వుండదు భ్రమ తప్ప.

ఆమె అలా లాజిక్‌గా మాట్లాడేసరికి అతనికేం మాట్లాడాలో అర్థంకాలేదు.

చివరగాఅన్నాడు "నెగెటివ్‌గా ఆలోచించడంమాని, పాజిటివ్‌గా ఎందుకు ఆలోచించవు శరణ్యా. నీమీద ప్రేమనయితే పెంచుకున్నానుకాని దాన్ని ఇపుడు ఎలా తెంచుకోవాలో అర్థంకావడంలేదు. నువ్వులేని జీవితాన్ని వూహించుకోలేకపోతున్నాను. నా ప్రేమను నువ్వు ఇంతగా అవమానిస్తుంటే నేను

## కొలెస్టరాల్ విచిత్రం



పెన్సిల్‌వేనియా విశ్వవిద్యాలయానికి చెందిన జేమ్స్ విల్సన్ అనే ప్రొఫెసర్ ఈ మధ్యన కొలెస్టరాల్ శాతాన్ని రక్తంలో తగ్గించడానికి ఓ అద్భుతమైన ప్రక్రియను రూపొందించాడు. అమెరికాలోని క్వేబె పట్టణానికి చెందిన 30 సంవత్సరాల స్త్రీకి 16 ఏళ్ల క్రితమే ఓసారి గుండెనొప్పి ఉధృతంగా వచ్చి తగ్గింది — మళ్లీ ఆమెకు మొన్నీమధ్యనే కొలెస్టరాల్ శాతం విపరీతంగా పెరిగిపోవడంతో ప్రొఫెసర్ విల్సన్ ఆమె 'లివర్'లోని కొన్ని 'జీన్స్'ను మార్చాడు. ఫలితంగా ఆమె రక్తంలోని కొలెస్టరాల్ మళ్లీ మామూలుగా అయిపోయిందట! వైద్యరంగంలో ఇదొక అద్భుత సంఘటన!

— జూపిటర్

ఇంకాఎందుకు బ్రతికివున్నానా అనిపిస్తుంది''

''నేను నీ ప్రేమను అవమానించడంలేదు. ప్రేమ అనే పదంమీద నాకు నమ్మకం లేదని చెప్తున్నాను. నా జీవితంలో ప్రేమకు, అనుబంధాలకు, అనురాగాలకు స్థానంలేదు. జీవితాంతం ఇలా ఒంటరిగానే వుండిపోవాలనుకుంటున్నాను'' చెప్పింది శరణ్య.

''కాని జీవితంలో ఏనాడైనా నీకు ఒక తోడు కావాలని అనిపించదా. నిన్ను ప్రేమించే వ్యక్తి ఒకరు వుండాలని కోరుకోవా''

''అది జరుగుతుందని అనుకోను''

శరణ్య జవాబుకు నీరుగారిపోయాడు అనూప్.

''ఇదే నీ నిర్ణయమా''

''బలవంతంగా సింహాన్ని బోనులో బంధించగలమేమోగాని, పువ్వును మాత్రం వికసింపజేయలేము''

ఆ మాటతో శరణ్య మనసేమిటో పూర్తిగా అర్థమైపోయింది అనూప్‌కు.

''ఓకే శరణ్యా. నిన్ను ఈ విషయంలో ఇక బలవంతపెట్టను. కాని, నిన్ను ప్రేమించడం మాత్రం మానను. జీవితాంతం బ్రహ్మచారిగా వుండిపోతానుగాని, నా భార్యగా మరో స్త్రీని ఆహ్వానించలేను. ఐ లవ్‌యూ అండ్ గుడ్‌బై'' చకచకా అక్కడి నుండి కదిలివెళ్లిపోయాడు అనూప్.

అతను వెళ్లినవైపే అచేతనంగా చూస్తుండిపోయింది శరణ్య.

☆ ★ ☆

రెండు దశాబ్దాలు కాలగర్భంలో కలిసిపోయాయి.

ఒకతరం ముసలిదైపోయింది. మరో తరం నూతన యౌవనంతో ఉరకలేస్తుంది.

ఇపుడు శరణ్యలో చాలా మార్పు వచ్చింది. యూనివర్శిటీలో లెక్చరర్‌గా పనిచేస్తోంది. సన్నగా వుండే ఆమె కొంచెం లావెక్కిందుగా, హుందాగా అయింది. తల ఎక్కువశాతం నెరిసింది. వెంట్రుకలను ముడివేస్తుంది.

శరణ్య ఇప్పుడు పూర్తిగా ఒంటరిదైపోయింది. తల్లి బ్రతికివున్నంతకాలం ఆమెకు ఒంటరితనం అంత బాధనిపించలేదు. కాని, తల్లిచనిపోయాక ఆమె ఏకాకిఅయిపోయింది.

జీవితమంటే నిరాసక్తత కలగసాగింది ఆమెకు. ఎవరికోసం, ఎందుకోసం బ్రతకాలి. తనకంటూ ఈ ప్రపంచంలో ఎవరూ లేరు అనే ఆలోచనతో ఆమె నిస్పృహకు లోనవుతోంది.

కాలేజీనుండి అలసిపోయి ఇంటికి వస్తే పలకరించడానికి ఎవరున్నారు ఇంట్లో. ఎవరూ లేరు. నాకు నేను తప్ప ఎవరూ లేరు అని బాధపడసాగింది.

ఆమె జీవితం అలా యాంత్రికంగా సాగుతున్న సమయంలో అదే యూనివర్శిటీకి అనూప్ ప్రొఫెసర్‌గా వచ్చాడు.

ముందు అతన్నిచూసి ఆశ్చర్యపోయింది శరణ్య. ఆతరువాత ఎంతోసంతోషించింది.

ఆమెను చూడగానే అనిర్వచనీయమైన అనుభూతికి లోనయ్యాడు అనూప్.

''ఎలా వున్నావు శరణ్యా'' ఆర్తిగాఅడిగాడు.

''బాగానే వున్నాను. నీవెలా వున్నావు'' అడిగింది.

నవ్వాడు అనూప్.

☆ ★ ☆

ఒకరోజు శరణ్య ఇంటికి బయలుదేరాడు అనూప్. అతన్ని చూడగానే నవ్వుతూ ఆహ్వానించింది శరణ్య. చాలాసేపు ఎన్నో విషయాలగురించి మాట్లాడుకున్నారు.

"నీకు పిల్లలెందరు" మాటల్లో అడిగింది శరణ్య.

చురుగ్గా చూశాడు అనూప్.

"సారీ నాకు పిల్లలు లేరు. నేను బ్రహ్మచారిని" చెప్పాడు.

అవాక్కయింది ఆమె.

"ఆ... అంటే మీరు ఇ... ఇంతకాలం... ." ఆమెకి ఏంమాట్లాడాలో అర్థంకాలేదు.

"అవును. ఇంతకాలం పెళ్లి కాకుండానే వుండిపోయాను. కేవలం నీకోసం. నీమీద వున్న ప్రేమకోసం. నీవు వుండే స్థానంలో మరో స్త్రీని ఊహించడం ఇష్టంలేక. ఇప్పటికైనా ప్రేమ ఎంతటి త్యాగానికైనా సిద్ధపడుతుందని నమ్ముతావా" అన్నాడు అనూప్.

ఇంకా ఆశ్చర్యంనుండి తేరుకోలేదు ఆమె.

"జీవితాంతం బ్రహ్మచారిగా వుండిపోతాను. కాని నా భార్య స్థానంలోకి మరో స్త్రీని ఆహ్వానించలేను" అన్న ఆనాటి అతని మాటలు తేలిగ్గా కొట్టిపారేసింది తను.

కాని అతను నిజంగా బ్రహ్మచారిగా వుండిపోతాడనుకోలేదు. ఆమెకింకా సంభ్రమంగా వుంది.

"అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ నేను నిన్ను ప్రేమిస్తూనేవుంటాను శరణ్య" అన్నాడు.

ఆ మాటలు శరణ్య మనసును కదిలించాయి.

ఆమెకళ్లలోకి సూటిగాచూశాడు అతను.

ఆమె కళ్లలో ఏదో అస్పష్టమైన భావం.

అతని కళ్లలో ఒక్కసారిగా వెలుగు నిండింది.

దానికోసమే... ఆ భావంకోసమే ఇన్నాళ్ల తను ఎదురుచూసింది. తన నిరీక్షణ ఫలించింది.

ఆమె ప్రేమ నిండిన కళ్లతో అతనినే చూస్తోంది.

అతను రెండు చేతులు ముందుకు చాపాడు. ఒక్క ఉదుటున వచ్చి అతని గుండెమీద వాలిపోయింది శరణ్య.

ప్రేమ!
అదొక మహత్తర శక్తి
తన విశాల రెక్కలక్రింద
రెండు హృదయాలను
అలవోకగా ఏకంచేసే ఒంటరిపక్షి

☆ ★ ☆

